# కానుక

— మాడుగుల కృష్ణకుమారి

ఉదయం సంఘటన ఎంత వద్దనుకున్నా శారదమ్మ మనస్సులో కదలాడక మానడంలేదు.

కొడుక్కి అన్నం పెడుతోంది శారదమ్మ

"అబ్బా! ఈ కూరేమిటి ఇంత కారంగా తగల డింది" అని విసుక్కుంటూ తింటున్న కంచంలో వుమ్మేశాడు రమేష్.

చివుక్కుమందావిడ మనసు.

"అయ్యో! పొరపాటున ఎక్కువేసినట్లున్నా నురా" అంది నొచ్చుకుంటున్నట్లుగా.

"వండి పెడితే తినటం కాదు. వండటం కూడా నేర్చుకోవాలి అని తెలుసుకో" అని కంచంలో చెయ్యి కడిగి విసురుగా వెళ్ళిపోయాడు.

స్థాణువులా వుండిపోయింది శారదమ్మ.

"ఇన్ని రోజులూ చేసిపెడుతున్నా! ఒక్కరోజు మంచం దిగబొయ్యేసరికి అందరికీ చిరాకే. వంట మనిషిలా చేసిపెడుతూంటే ఎవ్వరికీ తెలియటం లేదు. ఈవిడగారి వంటలతో రోగాలొచ్చి మంచా లెక్కడం ఖాయం" అత్తగార్కి వినపడాలనే అంది కోడలు లలిత.

ఒక్కసారిగా చలనం కల్గి బాహ్యంలోకి వచ్చిం దావిడ.

కోడలు ఏం చెప్పిందో మరి–

"నా దగ్గర డబ్బులేదు. ఇంత సంసారం ఈడ్చ టం నావల్లకాదు. నన్నేం అడగకు" విసురుగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు రమేష్.

క్రితం నెలవరకు తన జీతంతో ఇంటి అవస రాలన్నీ గడిపేశారు.

ఈనెల తన జీతమింక రాదని తెలియడంతో మొదలయింది చికాకు.

'ఇంత సంసారం అంటే తనేగా అదనపుభారం. భార్యా పిల్లలువాడికి విధాయకమేగా.

అవును తనిప్పుడు ఒట్టిపోయిన గొడ్డు. ఎండి పోయిన చెట్టు వాళ్ళ దృష్టిలో.

ఎంతలో ఎంత మార్పు

చెరువులోని చేపల్లాగా ఎలా బయటపడ్డారు.

తనకంటూ ఒక ఆలోచన, ఒక నిర్ణయం లేదా?

ఆడదాని సంపాదన తెచ్చే ముప్పు అనుభవ పూర్వకంగా రుజువయింది ఆవిడకు.

తన రిటైర్‌మెంటు ఎంత అనూహ్యమయిన మార్పు తెచ్చింది వాళ్ళ ప్రవర్తనల్లో.

ఇన్నాళ్ళూ తనకెలాటి గౌరవాభిమానాలు లభించాయి ఈ ఇంట్లో మరీ రోజు!

ఒకసారావిడ మనసు గతం వైపు పరిగెత్తింది.

•••



వైవాహిక జీవితం శారదకు మిగిల్చింది పాతిక సంవత్సరాల వయసులో వైధవ్యాన్ని దాంతోపాటు ఇద్దరు పిల్లల్ని.

ఆ రోజు నుంచి భర్త వుద్యోగ బాధ్యతతో పాటు, పిల్లల బాధ్యతను కూడా మీదేసుకుని సక్రమంగా పెంచి పెద్దచేసింది.

తన బాధను మింగుకుని వాళ్ల కోసం ఆనందం నటించింది.

ఏ లోటూ లేకుండా పెంచి వాళ్ళు అడిగింది కాదనలేదు ఏనాడు.

ఆడ పిల్లను విద్యాబుద్ధులు చెప్పించి ఓ ఇంటి ఇల్లాలుగా చేసింది.

ఒక్కగానొక్క కొడుకును వాడడిగిన చదువు చెప్పించి డబ్బు ఎదురు పెట్టి మరీ వుద్యోగం వేయించింది.

అన్ని సంవత్సరాలు, గానుగెద్దులా శ్రమపడిన తను, వాళ్ల ఆనందాన్ని చూసి శ్రమను మర్చిపో కల్గింది.

కానీ, మొదటిసారిగా ఆ శ్రమకు ఫలితం తను అనుకున్నది కాదని గ్రహించటానికి ఎంతో కాలం పట్టలేదావిడకు.

కల్లా కపటం లేని తన మనసు వారి కపట ప్రేమను అర్థం చేసుకోలేకపోయింది.

అమ్మగా తన ప్రేమ బిడ్డల మీదుంటే-వారి ప్రేమ తన సంపాదన మీదుంది. అది తాను చాలా ఆలస్యంగా గ్రహించింది.

పైకి ఎంత గౌరవం-ఎంత మన్నన.

"అరరే అత్తయ్యగారూ మీరు వంటగదిలోనా?" ఆశ్చర్యంగా చూసింది, కోడలు లలిత అత్తగారివైపు.

"ఏమ్మా! నేను ఆడదాన్ని కాదా? వంట చెయ్యకూడదా?" అంది శారదమ్మ నవ్వుతూ కూర కలియబెడుతూ.

"అదికాదత్తయ్య! ఇన్నాళ్లూ అంటే అటు వుద్యోగం, ఇటు వంటతో అవస్థ పడ్డారు. ఇంక మీరు హాయిగా వుద్యోగాన్ని చూసుకోండి. మీక్కావల్సినవి అమర్చే పూచినాది" అంది లలిత అత్తగారి చేతులు పట్టుకుని అభిమానంగా

"అబ్బే! నాకిదేం కష్టం కాదమ్మా. అలవాటయిన పనేగా" అందావిడ.

"ఏమయినా సరే మీరీ రోజునుంచి వంటగదిలోకి రావటానికి వీల్లేదు. ఇది మీ అబ్బాయి గారి ఆర్డరు, ప్లస్ నా విన్నపం" అందామె.

"అవునమ్మా -ఇన్నాళ్ళు కష్టపడ్డావు. ఇకనయినా లలితను చెయ్యనియ్యి" అన్నాడు రమేష్.

ఆప్యాయంగా చూసిందావిడ కొడుకు వైపు.

"సరేనమ్మా నీ యిష్టం కూరోచ్చే పెట్టి చేసి పెడతానంటే వద్దనే అత్తగారు ఎక్కడన్నా వుంటుందా?" అందావిడ అభిమానంగా కోడలివైపు చూసి.

"అలా అన్నారు బాగుంది. మా అత్తగారు అందరి అత్తగార్లాంటివారు కాదు. ఉద్యోగం చేసే అత్తగారు" అంది లలిత అత్తగార్ని ముద్దాడుతూ.

పిచ్చిపిల్లా అనుకుందావిడ.

రోజూ, ఆఫీసుకు వెళ్ళే టైముకల్లా కోడలు తనకి వండి పెట్టటమే కాకుండా, కట్టుకునే చీర దగ్గర్నుంచి రడీగా పెట్టడం ఎంతో హాయిగా అన్పించేది శారదమ్మకు.

సాయంకాలం ఆఫీసు నుంచి రాగానే ఎదురుగా టేబులు మీద కాఫీ, టిఫిన్ రడీగా వుంచేది లలిత. సాయం కాలం పూట మనవల ఆట పాటలతో గడిచిపోయే శారదమ్మకు పగలు ఆఫీసులో పడ్డ శ్రమ ఏ మాత్రం గుర్తుండేది కాదు.

కోడలు తన పట్ల చూపుతున్న ఆదరణకు పర్యవసానం ఆ పిల్ల పట్ల ఎంతో అభిమానం, ప్రేమ పెరిగి రెట్టింపయినాయా అత్తగార్కి.

ప్రతి నెలా జీతం తెచ్చి కోడలు చేతికిచ్చేది.

ఓసారి తన చీరలు వుతుకుతున్న కోడల్ని, చూసి-

"అదేమిటమ్మా పని మనిషి చేత వుతికించక అనవసరంగా నీకు శ్రమ" అందావిడనొచ్చుకుంటూ.

"మా అమ్మ చీరయితే వుతకనా అత్తయ్యా. మీరు నాకు అమ్మకన్నా ఎక్కువే" అని కోడలు అంటుంటే ఆ ఆప్యాయతకు ఆవిడ కళ్ళు చెమ్మగిలాయి.

ప్రతి పండక్కి కొడుక్కి, కోడలు, మనవలకి బట్టలు తెచ్చేది శారదమ్మ.

ఆ నెల ఎరియర్స్ రూపాన అత్తగార్కి అయిదు వేల రూపాయలు అదనంగా వచ్చాయని తెలియడంతో

"అత్తయ్యా! చాలా రోజుల్నించి మీ అబ్బాయిని గాజులు చేయించమని అడుగుతున్నాను. మీర యినా చేయించరూ" అంది గోముగా లలిత.

"చూడమ్మా! మరోసారి నీ కోరిక తప్పక తీరుస్తాను. ఈ డబ్బుతో నాకు చాలా ముఖ్య అవసరం వుంది" అందావిడ.

అంతే, లలిత ముఖంలో రంగులు మారాయి.

"పోన్లెండి నాముఖానికింతే అని సర్దిపెట్టుకుంటాను."

"ఎందుకమ్మా! ఈ చిన్న విషయానికి అంతగా నొచ్చుకుంటావు" అందావిడ.

"ఇదే మీ కూతురు అడిగితే కాదంటారా? కోడల్ని కాబట్టే అలా అన్నారు" అంది లలిత రోషంగా.

"చూడమ్మా-నిన్నేనాడూ వేనా దృష్టితో చూడలేదు. పరిస్థితి చెప్పాను అర్థం చేసుకో" అందావిడ.

ఆ సంఘటన జరిగిన ఒకటి రెండు రోజులు ముభావంగా వున్నా తర్వాత మామూలుగానే వుంది లలిత.

కోడలి మనసు నొప్పించానన్న భావనతో అందాక తన గాజుల జతను ఒకదాన్ని కోడలి చేతులకేసింది శారదమ్మ.

కానీ కోడలి ప్రవర్తనలో ఏదో మార్పు గమనించక పోలేదావిడ. కొడుకు పెళ్ళికి ముందరయితే నెలకు కొంత డిపాజిట్ చేసేది శారదమ్మ. మరిప్పుడు కోడలు ఏం చేస్తోందో తెలియదు.

ఆ మాట అడిగినందుకు ఫలితంగా, ముభావంగా నెంవారీ ఖర్చు రాస్తున్న పుస్తకం తెచ్చి అత్తగారి ముందు వుంచింది లలిత.

అప్రయత్నంగా పుస్తకం తిరగేస్తున్న ఆవిడ దృష్టి-

ప్రతినెలా పనిమనిషి బట్టల వుతుకు ఖర్చుగా రెండువందల రూపాయలుండటం చూసి చకితురాలై యింది.

"ఏమిటమ్మా యిది!" అంది ఎలా అడగాలో తెలియక.

"అవునండీ పని మనిషికి వేస్తే ఎలాగూ యివ్వాలిగా వారానికి ఏడు చీరలు చొప్పున నెలకు ఇరవై ఎనిమిది చీరలు లాండ్రీకి వేసినా, పనిమనిషి వుతికినా ఇంతకన్నా ఎక్కువే అవుతుంది. అందుకే ఆ డబ్బు నేనే తీసుకున్నాను." అంది.

మొదటిసారిగా కోడలి ముఖం చూడటాన్కి సిగ్గనిపించిందావిడకు.

మరి కొన్ని రోజుల్లో తన జీతం మాత్రమే ఇంటి ఖర్చులకు వాడుతున్నారని కొడుకు జీతం మొత్తం డిపాజిట్ చేస్తున్నారని తెల్సినా ఏం అనలేదు ఆవిడ.

మరుసటి నెల తనకు కావాల్సిన డబ్బు వుంచుకుని మిగిలింది మాత్రమే కోడలికిచ్చింది.

అంతే. డబ్బు చాలటంలేదని, ఈ సంసారం నిర్వహించడం తన వల్లకాదని అత్తగార్కి వినపడేలానే సణుగుడు మొదలుపెట్టింది లలిత.

అత్తగారి మౌనాన్ని ఆసరాగా తీసుకుని మరింత విజృంభించింది లలిత.

ఒకొక్క రోజు కాఫీ మాత్రమే యిచ్చి టిఫిన్ మానేసేది లలిత.

అదే సమయాన కొడుకుకి టిఫిన్ చెయ్యటం చూసినా పెదవి విప్పేదికాదావిడ.

మరో గణనీయమైన మార్పు ఆ ఇంట్లో శారదమ్మ రిటైర్మెంటుతో.

తల్లి రిటైర్ అవడం కొడుక్కి, అత్తగారు రిటైరవ్వడం కోడలికి కష్టంగా వుంది.

"అమ్మా! రిటైర్ అయ్యావు కదా ఎంత డబ్బు వస్తుందంటావు? వచ్చే డబ్బును ఏం చెయ్యాలనుకుంటున్నావు" అనడిగాడు కొడుకు.

"ఏం చేస్తారండి మీరు మరీను. ఆవిడకి మనం తప్ప ఇంకెవరున్నారు" అంది కోడలు.

"ఇంకా నేనేం నిర్ణయించుకోలేదు బాబూ" అంది శారదమ్మ.

తల్లి రిటైర్ అయిందని తెలియడంతో వచ్చిన కూతురు రజిత "ఏమిటమ్మా-ఇలా చిక్కిపోయావు?" అంది తల్లిని చూసి.

అంతేకాదు "అమ్మా నీ చేతికి రెండు జతల గాజులూలేవు ఏమయినాయి ఏమిటి?" అని కూడా అడిగింది.

వదినకో జత యిచ్చానన్న తల్లి మాటలువిని 'నేను చచ్చాననుకున్నావా' అంది గొణుక్కుంటూ.

ఈ సమయంలో చెల్లెలు రావటం ఎందుకా అన్న అనుమానంతో వున్నాడు రమేష్.

ఆ రాత్రి తల్లి పక్కనే పడుకుని కబుర్లు చెపుతున్న రజిత వున్నట్లుండి తల్లి గుండెల్లో ముఖాన్ని దాచుకుని వెక్కి వెక్కి ఏడవసాగింది.

"ఏమ్మా రజితా ఏమయింది?" అంది శారదమ్మ ఖంగారుగా.

"అమ్మా! జీవితంలో వుద్యోగం పేరిట ఎంతగానో అలసిపోయావు. నాన్న ఎలావుంటాడో తెలియని మమ్మల్ని పెంచి పెద్ద చేసి మాకో జీవితాన్నిచ్చావు. ఇన్నాళ్ల శ్రమ అనంతరం నీకు విశ్రాంతి ఎంతయినా అవసరం. ఎప్పుడు రమ్మన్నా వుద్యోగం వంక చెప్పేదానివి ఇప్పుడిక సర్వీసు అయిపోయిందిగా నాతో వచ్చేయమ్మా" అంది రజిత ప్రేమగా తల్లిని చూసి.

కూతుర్ని ఆప్యాయంగా మరింతగా దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకుంది శారదమ్మ.

ఎంతయినా ఆడపిల్ల కాబట్టే ఆ మాత్రం ప్రేమను పంచ కల్గింది.

"అమ్మా! సర్వీసులో వున్నంతవరకు నెల నెలా జీతం మొత్తం అన్నయ్య కుటుంబానికే ఖర్చు పెట్టావు. నేను కాదనలేదు. ఇప్పుడు నువ్వు రిటైర్ అయ్యాక వచ్చే డబ్బు మాత్రం నాకే యివ్వాలి. నిన్ను నా గుండెల్లో పెట్టి చూసు కుంటాను" అంది కూతురు.

గునపం దింపేలాంటి మాట అని గుండెల్లో పెట్టుకుంటుందిట కూతురు.

"ఎవరూ నావారు కాదు" అన్న పాట గుర్తుకు వచ్చిందామెకు. తల్లి నిర్ణయం చెప్పకపోవటంతో జాబు రాయమని చెప్పివెళ్ళింది రజిత.

శారదమ్మ మనసుని అర్థం చేసుకోకపోగ, తమ అసలు నైజాల్ని బయటపడేసుకున్నా రామె సంతానం

ఉదయం పేపరు చదువుతున్న అత్తగార్కి విన పడేలా

"అప్పుడంటే ఆఫీసు కాబట్టే వంట వద్దన్నాను. ఇప్పుడేమొచ్చింది. వుద్యోగాన్కి రిటైర్‌మెంటు కానీ, తిండికి, పనికి కాదుగా" అంది కోడలు పరోక్షంగా.

కొడుకయితే-

"అమ్మా! ఇన్నాళ్లూ నా భార్య కష్టపడింది. ఇప్పుడు నీకు పని లేదుగా కాస్త హెల్ప్ చెయ్యి" అని నేరుగానే చెప్పాడు.

అప్పుడు చేశాను కాబట్టే ఇప్పుడు చేయించుకు తీర్తాను అన్నట్లుగా ఇంటిపని మొత్తం అత్తగారి మీదే వదిలింది కోడలు.

అలవాటు తప్పిన పనవటం వల్ల అలసటగా అన్పిస్తోంది శారదమ్మకు.

అదే రీతిలో వుదయం కారం ఎక్కువయింది కూరలో.

కడుపులోని కోపాన్ని బయట పెట్టాడు కొడుకు. సంధ్య చీకట్లు ముసరడంతో వాస్తవంలోకి వచ్చిందామె.

•••

మరో రెండు రోజుల్లో వుగాది పండగవటంతో కూతురికి వుత్తరం రాసింది శారదమ్మ.

అందుకోవటమే తరువాయి రెక్కలు కట్టుకుని వాలింది కూతురు.

ప్రతి పక్షాలు రెండూ, అధికార పక్షం చెప్పే నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నట్లుగా వాళ్లు ఆతృత పడసాగారు. తల్లి ఏం చెపుతుందా అని.

"చూడు బాబూ రమేష్ నానిర్ణయం కోసం మీరు చాలాఆతృతగా ఎదురు చూస్తున్నారని నాకు తెల్సు. నాకు మీరిద్దరూ సమానమే. ఆడా-మగా నాకెప్పుడు తేడా లేదు.


"నేను సర్వీసులో వుండగా కొన్న ప్లాట్‌లో ఇప్పుడొచ్చిన డబ్బుతో రెండు వాటాల యిల్లు కట్టించాను. నా రిటైర్‌మెంట్ కానుకగా మీరిద్దరికీ చెరొక వాటా యివ్వాలనుకున్నాను " అని ఆవిడ చెప్పటం పూర్తికాకుండానే.

"కొడుకుగా మొత్తం ఇల్లు నాకేచెందాలి. వాటా వెయ్యటాన్కినే ఒప్పుకోను" అన్నాడు రమేష్ తీవ్రంగా.

"ఏం, ఎందుకొప్పుకోవు. అమ్మ వుద్యోగం చేసినన్నాళ్లు ఆ జీతం మొత్తం మీరేగా వాడుకున్నారు. న్యాయంగా అసలా ఇల్లంతా నాకే చెందాలి. అమ్మ జిత బంగారం గాజులు వదిన కిచ్చినా, నేను మంచిదాన్ని కాబట్టే వూరుకున్నాను" అంది రజిత రెట్టింపు స్వరంతో.

తను ఎదురుగా వున్నానన్న లక్ష్యం కూడా లేకుండా వాళ్ళిద్దరి తగవు చూస్తుంటే దుఃఖం వచ్చింది శారదమ్మకు.

"ఇదిగోనమ్మాయి ఆడపడుచా నేను మీ అమ్మకు చేసిన చాకిరీకి ఆవిడ నాకిచ్చింది కానీ, నాకేం వూర్కే యివ్వలేదు మీ అమ్మ" అంది కోడలు కల్పించుకుని.



**వెండి నల్లబడకుండా**

కొందరు వెండి పాత్రలని ఉపయోగించకుండా ఓ మూలన పెడుతుంటారు. అలా చేస్తే అవి త్వరగా నల్లబడిపోతుంటాయి. అల్లా నల్లబడిపోకుండా ఉండాలంటే వాటిని ఉంచే ప్రాంతంలో కర్పూరాన్ని ఉంచాలి. ఆ విధంగా చేస్తే వాటి మెరుగు ఏమాత్రం తగ్గకుండా ఉంటుంది.

- భో. శ్రీ

తన అభిమానానికి కోడలు ఎంతచక్కటి విలువ కట్టింది.

"అసలా గాజుల గురించి అడిగే హక్కు నీకు లేదు. అది అమ్మ యిష్టం" అన్నాడు రమేష్.

"అయితే అమ్మ యిష్ట ప్రకారమే నాకు వాటా యిస్తుంటే వద్దనటాన్కి నువ్వు ఎవరు?" అంది రజిత మాటకి మాటగా.

"అది నాన్న పోతే అమ్మకి ఇచ్చిన వుద్యోగం కనుక అది నాన్నదే అవుతుంది.

"తండ్రి ఆస్తికి వారసుడు కొడుకు అయినట్లే ఆ డబ్బుకి కూడా నేనే వార సుడ్ని. నల్గురిలో పంచాయితీ పెడితే న్యాయం నావైపే మొగ్గుతుంది."

"సరే అయితే బంగారం మొత్తం నాకే చెందుతుంది. వదిన్ని గాజులు తీసియివ్వమను."

"మా అత్తగారు నాకిచ్చిన గాజులు నేను చచ్చినా తిరిగివ్వను. అడగటాన్కి నువ్వెవరు?" అంది కోపంగా కోడలు.

"ఎవరివా? మా అమ్మ బంగారానికి వారసురాల్ని."

"ఆ వచ్చిందండి పెద్ద వారసురాలు. ఒక్క పూట అమ్మని తీసుకెళ్ళి గుప్పెడు అన్నం పెట్టలేదు కానీ, కబుర్లు చెపుతోంది కబుర్లు. ఇన్నాళ్లూఆవిడ్ని మేమే పోషించాము. కాబట్టే ఆవిడదంతా మాకే చెందుతుంది. ఆ హక్కు మాది" అంది కోడలు.

అప్పటివరకు వాళ్ళ తగాదా వింటున్న శారదమ్మ ఓపిక నశించి,

"ఆపండి" అని బిగ్గరగా అరిచింది.

"ఆహ! నేను కన్న నా సంతానం ఎంత ఎదిగిపోయారో చూస్తుంటే నాకీ రోజు చాలా ఆనందంగా వుంది."

దుఃఖంతో ఆవిడ గొంతు పూడుకుపోయింది.

"ఏమ్మా కోడలా! మీరు నన్ను పోషించారా?" ఆ మాట నా ముఖం చూసి చెప్పు. డబ్బు యిస్తే ఓలాగ, డబ్బు యివ్వని మరుక్షణం మరోలా ప్రవర్తించే నువ్వు, ఆ మాట ఎలా అనగల్గావమ్మా.

"ఏరా రమేష్! దీని గురించి నల్గురిలో పంచాయితీ పెడతావా? ఏమని పెడతావురా? మా అమ్మ సంపాదనతోనే ఆవిడనిన్నాళ్ళు పోషించాను. కొడుకుగా నా నుంచి ఒక్క పైసా కూడ ఎరగదు. మా అమ్మను చూడాల్సిన బాధ్యత నాది కాదు. కానీ, ఆవిడ సంపాదన మీద హక్కు మాత్రం నాదని చెపుతావా?

"ఏమ్మా రజితా! ఆడపిల్లివి నావైపు వుంటావనుకున్నాను. కానీ నా ఆశను వమ్ము చేశావు. కన్న తల్లి మీద కన్నా కరెన్సీ నోట్లమీద మీకు మమకారం అని, ఇద్దరి కిద్దరూ రుజువు చేశారు."

"డబ్బు యివ్వకపోతే ఇంట్లోంచి వుద్వాసన చెప్పే కొడుకుని, అమ్మకన్నా ఆమె బంగారమే ముఖ్యం అనుకునే కూతుర్ని కన్నందుకు నేను చాలా సిగ్గుపడుతున్నాను. నా పెంపకం మిమ్మల్నిలా తయారు చేస్తుందని నేనేనాడూ అనుకోలేదు. ఇది నా దౌర్భాగ్యం

"నా నిర్ణయం పూర్తిగా చెప్పకుండానే మీరు తగవులకి దిగారు. డబ్బు వచ్చిన ఒక్క నెల రోజులు మీరు ఆగలేకపోయారు. మీకు సడన్‌గా చెప్పి సర్‌ప్రయిజ్ చేద్దామనుకున్న నన్నే మీరు ఆశ్చర్యపరిచారు. ఎంతో ఆశగా మీకు కానుకగా యివ్వాలనుకున్న నా నిర్ణయాన్ని యిప్పుడు మార్చేసుకుంటున్నాను.

"డబ్బున్న నాలాటి తల్లులే యిలాటి విషమ పరిస్థితి ఎదుర్కుంటే, మరి డబ్బులేక బిడ్డల నిరాదరణకు గురయిన ఎందరో తల్లులున్న వ్యవస్థ మనది. చెట్టుపంచిన పళ్ళని తిని తీపిని మర్చిపోయి, చెట్టు కొట్టి కట్టెలమ్మే ఈ కన్న బిడ్డలబారి నుండి కొందరుతల్లుల కయినా రక్షణ కావాలి. అందుకే వృద్ధుల రక్షణ గృహానికి కానుకగా నా ఇంటి నివ్వాలని నిర్ణయించుకున్నాను. మీకెవరికీ భారం లేకుండా నేకూడా అక్కడికే వెళ్ళి పోవాలనుకుంటున్నాను" అంది స్థిరమైన గొంతుతో శారదమ్మ. □